# వేములవాడ అభివృద్ధి నా బాధ్యత


వేములవాడ పట్టణంలో వ్యాపారస్తులను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- వేములవాడలో ఇంటింటా ప్రచారం

వేములవాడ, అక్టోబర్ 30: వేములవాడ పట్టణాభివృద్ధి నా బాధ్యత అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం నుంచి రాజన్న ఆలయం వరకు ప్రధాన రహదారిలో దుకాణాల్లో తిరుగుతూ ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ పట్టణంలోని రహదారుల విస్తరణ, ఆలయ అభివృద్ధికి తాను కట్టుబడి పని చేస్తానని చెప్పారు. వ్యాపారులకు కూడా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కష్టసుఖాల్లో తాను భాగస్వామ్యం అవుతానని చెప్పారు. ఇప్పటివరకు వేములవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న, మిగిలిన అభివృద్ధి పనులు అన్నింటిని తను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కారు గుర్తుపై ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేద్దామని ఆయన కోరారు. పట్టణంలోని 25వ వార్డు మార్కండేయ నగర్‌లో లక్ష్మీనరసింహారావు సతీమణి సునీల, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్ గూడూరు లక్ష్మీలతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మారం కుమార్, నరాల శేఖర్, ఇప్పపుల అజయ్, విమశెట్టి విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మార్కండేయ నగర్ వీధిలో ప్రచారం చేస్తున్న చల్మెడ సతీమణి సునీల, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు

# అక్కున చేర్చుకోండి.. మీ రుణం తీర్చుకుంటా


రుద్రారంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

- మీ ప్రాంతం బిడ్డను.. ఆదరించి గెలిపించండి
- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలతో మోసపోయి గోసపడొద్దు
- సీఎం కేసీఆర్‌తోనే అగ్రస్థానంలో తెలంగాణ
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- రామడుగు మండలంలో ప్రచారం

రామడుగు, అక్టోబర్ 30: తనను ఆశీర్వదించి అక్కున చేర్చుకుంటే, అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటానని చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ ప్రాంతం బిడ్డగా ఐదేండ్లల్లో నియోజకవర్గాన్ని ఎన్నడూ లేనంత అభివృద్ధి చేశానని, కారుగుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కోరారు. రామడుగు మండలం దత్తోజీపేట, రంగశాయిపల్లి, రుద్రారంతోపాటు అనుబంధ గ్రామం కొత్తపల్లె(గొండ్లపల్లి)లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. తొమ్మిదేండ్ల కింద తెలంగాణ ఎట్లుండేనో మీ అందరికీ తెలుసన్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల లేక ఆడబిడ్డలు బిందెలతో రోడ్డెక్కి చేసిన ఆందోళనలు ఇంకా గుర్తున్నాయన్నారు. సాగు చేసేందుకు భూములున్నా.. నీళ్లు లేక పంట ఎడిపోతే రైతన్న గుండెపగిలి ప్రాణాలు తీసుకున్న వార్తలు ఇంకా మరిచిపోలేదన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా.. ప్రతి ఏడూ వేల క్యూసెక్కుల నీళ్లు మన ప్రాంతం నుంచి వెళ్లి సముద్రంలో కలుస్తున్నా.. నాటి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. నాడు చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలు కరువుతో అల్లాడేవన్నారు. అలాంటిది రాష్ట్రం ఏర్పాటు తర్వాత కాళేశ్వరం జలాలతో భూములను తడిపి వ్యవసాయ రంగానికే వన్నె తెచ్చిన మహనేత కేసీఆర్ అని కొనియాడారు. నేడు నిత్యం నీటితో కళకళలాడుతూ ఎటుచూసినా పచ్చని పంటపొలాలే దర్శనమిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని కోనసీమలా తీర్చిదిద్దేందుకు వరదకాలువకు నాలుగు ఓటీల నిర్మాణం చేపట్టామని, దీంతో ప్రతి ఎకరాకు నీటిని మలుపుకొని సాగుచేసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ కృషితోనే నేడు అభివృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ కర్ణాటకలో ఐదు గ్యారెంటీలతో గద్దెనెక్కి, అభివృద్ధి చేయలేక చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. అక్కడ 5 గంటలు కూడా ఇవ్వలేమని స్వయంగా ఆ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రే చెప్పడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలతో మోసపోయి గోసపడొద్దని విజ్ఞప్తి చేశారు. మరోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో సర్పంచులు బండ అజయ్‌రెడ్డి, సాదు పద్మమ్మ నీందర్‌రెడ్డి, వొంటెల అమరేందర్‌రెడ్డి, ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, ఎంపీటీసీలు కనకం జయ కనకయ్య, గుర్రం దేవికారాజశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ జూపాక కరుణాకర్, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్మన్ మామిడి తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ చాద ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు కొడిమ్యాల రాజేశం, బత్తిని తిరుపతిగౌడ్, చెన్నూరి శ్రీకాంత్‌రెడ్డి, గడ్డం మోహన్‌రావు, కట్ట బ్రహ్మచారి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు జవ్వాజి శేఖర్, వంచ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తౌటు మురళి, చాడ శేఖర్‌రెడ్డి, పెంటి శంకర్, గునుకొండ అశోక్, సైండ్ల కరుణాకర్, చిరుత రాంచంద్రం, జగన్, పెగుడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కమలంలో టికెట్ల కల్లోలం


రాజీనామా పత్రాలను చూపిస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు, నాయకులు

- కేటాయింపుపై ఆ పార్టీ సీనియర్ నాయకుల అసమ్మతి
- సిరిసిల్లలో రాణిరుద్రమకు ఇవ్వడంపై ఆగ్రహం
- జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు సహా 30మంది మూకుమ్మడి రాజీనామా

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: ఎన్నికలకు ముందే సిరిసిల్ల బీజేపీలో టికెట్ కల్లోలం మొదలైంది. సీనియర్లను కాదని, రాణిరుద్రమను సిరిసిల్ల అభ్యర్థిగా ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో కాషాయంలో కలకలం మొదలైంది. పార్టీ అధిష్ఠానంపై నిరసన వ్యక్తం చేస్తూ, రాజీనామాల పర్వంగా కొనసాగుతున్నది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి రమాకాంతరావు మొదటగా రాజీనామా చేయగా, ఆయన బాటలో ఓయూ విద్యార్థి తెలంగాణ ఉద్యమ నాయకుడు దరువు ఎల్లన్న, సిరిసిల్లకు చెందిన గడ్డం నాగరాజు మానకొండూరు టికెట్ ఆశించారు. వీరికి టికెట్ ఇవ్వకపోవడంపై పార్టీకి రాజీనామా చేశారు. రెండురోజుల క్రితం వీరు రాజీనామా చేయగా, తాజాగా సోమవారం బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు 50 మంది యువకార్యకర్తలతో కలిసి బీజేపీకి రాజీనామా చేశారు. పార్టీ, ప్రాథమిక సభ్యత్వానికి ముఖ్యమైన కార్యకర్తలంతా రాజీనామాలు చేస్తుండడంతో ఆ పార్టీలో ఉన్న కార్యకర్తలంతా అయోమయానికి గురవుతున్నారు.

### బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

బీజేపీ మాజీ అధ్యక్షుడు జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణు, పట్టణ అధ్యక్షుడు మల్కపేట భాస్కర్, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు సురువు వెంకటి, దళిత నాయకులు కంసాల మల్లేశం, సాయికృష్ణ, గడ్డం హరీశ్, ఎల్లం, అభిలాశ్, బొల్లి నవీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండ ప్రతాప్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల రవితోపాటు 200మంది నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు సంకపాక మనోజ్, దిడ్డి శ్రీనివాస్, ఎండీ సత్తార్, నాయకులు నామ్పాల్ల రవి, బొల్లి రామ్మోహన్ ఉన్నారు.

### రాణిరుద్రమ ఎలా గెలుస్తుందో చూస్తాం

సిరిసిల్లతో ఎలాంటి సంబంధం లేని రాణిరుద్రమకు టికెట్ కేటాయించడంపై బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి, బీజేపీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అన్నల్‌దాస్ వేణు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం 50 మంది నాయకులతో కలిసి పార్టీకి మూకుమ్మడి రాజీనామా చేశారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీలో 2008 నుంచి సైనికుడిలా పనిచేశానని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ఉద్యమ కాలంలో రాష్ట్ర సాధనతో పాటు జిల్లా ఏర్పాటు సమయంలోనూ భాగస్వాములయ్యాన్నారు. నాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో అనేక పోరాటాలు చేశామన్నారు. తనతోపాటు యువ నాయకులపై ఉద్యమ కేసులు ఉన్నాయని చెప్పారు. ఎలాంటి సంబంధం లేకుండానే బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చు చేశారన్నారు. జాతీయ నాయకత్వం సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ కేటాయించే సమయంలో స్థానిక నాయకులను కనీసం సంప్రదించకపోవడం విచారకరమన్నారు. కనీస గౌరవం లేని పార్టీలో కొనసాగబోమని, తమ పదవులతోపాటు ప్రాథమిక సభ్యత్వానికి 50 మంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు సురువు వెంకటి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బూర విష్ణు, పట్టణాధ్యక్షుడు భాస్కర్, కంసాల మల్లేశం, సిరిసిల్ల సాయికృష్ణ, హరీశ్ ఉన్నారు.


పార్టీలో చేరిన సిరిసిల్ల కార్యకర్తలతో నాయకులు

## మున్సిపల్ అధికారులపై వేటు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 30: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు అధికారులపై వేటు పడింది. డంపింగ్ యార్డు పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రఘుపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మిన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్)కు సిఫారసు చేశారు.

## తప్పిపోయిన బాలుడి అప్పగింత

వేములవాడ, అక్టోబర్ 30: వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చిన సిద్దిపేట జిల్లాకు చెందిన రమ్య-నరేందర్ దంపతులు బద్ది పోచమ్మ ఆలయ పరిసరాల్లో అద్దె గదిని తీసుకొని దిగారు. అందరూ బయటకు వెళ్లిన సమయంలో బాలుడు శివారెడ్డి కూడా వారితో రాగా దుకాణాల వద్ద తప్పిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు అప్పగించగా సామాజిక మాధ్యమాల్లో తప్పిపోయిన బాలుడి ఫొటో వైరల్ చేయడంతో స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులకు పట్టణ సీఐ కరుణాకర్ బాలుడిని అప్పగించారు. జాతర లాంటి ప్రదేశాలకు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

## మేకలు దొంగిలించినందుకు కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 30: గుండారంలోని ఓ షెడ్డులో కట్టేసిన మేకలు దొంగిలించిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన ముజరేకర్ ప్రశాంత్, చల్ల నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఈ నెల 10న గుండారానికి చెందిన లాల ఎల్లయ్య తన మేకలను షెడ్డులో కట్టివేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో చోరీ ఘటనపై దర్యాప్తు చేయగా ఇద్దరు వ్యక్తులు దొంగిలించినట్లు నిర్ధారించి కోర్టుకు తరలించగా కోర్టు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించి జైలుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.